nipuna
Every Wednesday Free Supplement
05.
22 జనవరి 2025
పేజీలు 8

### కొరియన్ ఫ్లైక్యాచర్


తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా భీమునిపాదం జలపాతం వద్ద అరుదైన పక్షి కొరియన్ ఫ్లైక్యాచర్ కనిపించింది. దీంతో దాన్ని రాష్ట్రంలో 445వ పక్షిజాతిగా జీవశాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఈ పక్షి తూర్పు ఆసియాకు చెందింది. చలికాలంలో కఠినమైన వాతావరణాన్ని తట్టుకునేందుకు నవంబర్, డిసెంబర్ నెలల్లో దక్షిణాసియాకు వలస వస్తుంది. ఈ పక్షి ఇంతకుముందు కేరళ, కర్ణాటక, గోవా, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో కనిపించింది. తెలంగాణలో కనిపించడం ఇదే తొలిసారి. ఈ పక్షి వేసవిలో కొరియా, మంగోలియా, జపాన్ దేశాల్లో సంతానోత్పత్తి చేస్తుంది. IUCN రెడ్ లిస్ట్‌లో Least Concern (తక్కువ ఆందోళన) ఉన్న జాతుల జాబితాలో ఉంది.

# ప్రపంచంలోనే అతి విస్తృతం - వివరణాత్మకం

## భారత రాజ్యాంగం @ 75

జనరల్ స్టడీస్ పాలిటీ

**భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, గణతంత్ర ప్రజాస్వామ్యంగా మలచడంలో భారత రాజ్యాంగం ఓ మైలురాయిలా నిలుస్తుంది. 1949, నవంబర్ 26న స్వీకరించిన భారత రాజ్యాంగం.. దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వానికి హామీని ఇస్తుంది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన జాతి ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది. ఈ దేశపు విభిన్న గొంతుకల ప్రతినిధిగా 1946, డిసెంబర్ 9న ఏర్పాటైన రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని రూపొందించింది. భారతదేశానికే ప్రత్యేకమైన అవసరాలను పట్టించుకుంటూనే ప్రపంచ వ్యాప్తంగా వివిధ రాజ్యాంగాల్లోని మంచి విషయాల నుంచి మన రాజ్యాంగం స్ఫూర్తి పొందింది. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి విస్తృతమైన, వివరణాత్మకమైన రాజ్యాంగం. అలా మన రాజ్యాంగం అసంఖ్యాకమైన ప్రజానీకాన్ని కలిపి ఉంచుతుంది. ప్రతి పౌరుడి హక్కులకు రక్షణను ఇస్తుంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా 75 ముఖ్యమైన విషయాలను తెలుసుకుందాం.**




**సభ ప్రాతినిధ్యం**

1. రాజ్యాంగ సభలో మొదట్లో మొత్తం 389 మంది సభ్యులు ఉన్నారు.
2. వీరిలో 292 మంది బ్రిటిష్ ఇండియా ప్రావిన్షియల్ (అప్పటి రాష్ట్రాల) లెజిస్లేటివ్ అసెంబ్లీల నుంచి ఎన్నికయ్యారు. 93 మంది స్వదేశీ సంస్థానాల నుంచి, నలుగురు చీఫ్ కమిషనర్ ప్రావిన్సుల నుంచి ప్రాతినిధ్యం వహించారు.
3. క్యాబినెట్ మిషన్ సిఫారసుల మేరకు రాజ్యాంగ సభ సభ్యులను పరోక్ష ఎన్నిక విధానంలో ఎంపిక చేశారు.

**తొలి సమావేశం**

4. రాజ్యాంగ సభ తొలి సమావేశం 1946, డిసెంబర్ 9న పార్లమెంట్‌లోని కాన్‌స్టిట్యూషన్ హాల్‌లో జరిగింది. దీన్ని ఇప్పుడు 'సంవిధాన్ సదన్' అని పిలుస్తున్నారు.
5. తొలి సమావేశానికి మధ్యంతర అధ్యక్షుడిగా డాక్టర్ సచ్చిదానంద సిన్హా అధ్యక్షత వహించారు.
6. 1946, డిసెంబర్ 11న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రాజ్యాంగసభకు శాశ్వత అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

**విభజన తర్వాత మార్పులు**

7. 1947, జూన్ 3 నాటి మౌంట్ బాటన్ ప్రణాళిక పాకిస్తాన్‌కు ప్రత్యేక రాజ్యాంగ సభ ఏర్పాటుకు దారితీసింది.
8. దేశ విభజన తర్వాత బ్రిటిష్ ఇండియా ప్రావిన్సులకు చెందిన కొంతమంది ప్రతినిధులు తమ రాజ్యాంగ సభలో సభ్యత్వం కోల్పోయారు.
9. దేశ విభజనతో రాజ్యాంగ సభలో సభ్యుల సంఖ్య 299కి తగ్గిపోయింది.

**స్థానాలు — నామినేషన్లు**

10. డాక్టర్ అంబేద్కర్ మొదట్లో బొంబాయి ప్రెసిడెన్సీ నుంచి రాజ్యాంగ సభకు పోటీ చేసి ఓడిపోయారు.
11. దీంతో ఆయన బెంగాల్ నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. కానీ బెంగాల్ విభజన జరగడంతో తన ప్రాతినిధ్యాన్ని కోల్పోయారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆయన్ని బొంబాయి ప్రెసిడెన్సీ నుంచి రాజ్యాంగ సభకు నామినేట్ చేసింది.
12. రాజ్యాంగ సభ మొత్తం 299 మంది సభ్యుల్లో 229 మంది 12 భారతదేశ ప్రావిన్సుల (రాష్ట్రాలు) నుంచి ఎన్నికయ్యారు. 70 మంది స్వదేశీ సంస్థానాల నుంచి నామినేట్ అయ్యారు.

**మహిళా వైతాళికులు**

13. రాజ్యాంగ సభలో 15 మంది మహిళలున్నారు.
14. వీరిలో సరోజిని నాయుడు, రాజకుమారి అమృత్ కౌర్, సుచేత కృపలానీ మొదలైనవారు ఉన్నారు.
15. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు పరిమితమైన హక్కులున్న సమయంలో రాజ్యాంగ సభలోని మహిళా సభ్యులు సమాన హక్కుల కోసం గొంతెత్తడం విశేషం.

**తొలి కార్యక్రమాలు**

16. భారతదేశ స్వాతంత్ర్యం, భారతీయుల ఐక్యత కోసం సాగిన పోరాటానికి గుర్తుగా 1946, డిసెంబర్ 9న వందేమాతరం ఆలాపనతో సమావేశాలు మొదలయ్యాయి.
17. ఆచార్య జేబీ కృపలానీ తొలి సమావేశంలో తొలి ప్రసంగం చేశారు. భారతదేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని పేర్కొంటూ, సభ్యులను ఆహ్వానిస్తూ ఆయన స్వాగత ఉపన్యాసం ఇచ్చారు.
18. 207 మంది సభ్యులు రిజిస్టర్‌లో తమ వివరాలు నమోదు చేసి సంతకాలు చేయడంతో మొదటిరోజు సమావేశం ముగిసింది.

**పతాక స్వీకారం**

19. భారత జాతీయ పతాకాన్ని రాజ్యాంగసభ 1947, జూలై 22న స్వీకరించింది.
20. ఇది 1947, ఆగస్ట్ 15 నుంచి 1950 జనవరి 26 వరకు 'డొమినియన్ ఆఫ్ ఇండియా' పతాకంగా ఉంది. ఆ తర్వాత నుంచి భారత గణతంత్ర పతాకంగా కొనసాగుతున్నది.
21. జాతీయ పతాకంలో కాషాయం బలానికి, ధర్మచక్రంతో కూడిన తెలుపు భాగం శాంతికి, ఆకుపచ్చ శక్తికి, వృద్ధికి ప్రతీకలు.

**మధ్యంతర సభ**

22. రాజ్యాంగసభ 1947, ఆగస్ట్ 14 రాత్రి కాన్‌స్టిట్యూషన్ హాల్‌లో సమావేశమైంది.
23. అదేరోజు అర్ధరాత్రి రాజ్యాంగసభ స్వతంత్ర భారతదేశానికి తాత్కాలిక చట్టసభగా కూడా అవతరించింది.
24. దీంతో భారతదేశంలో వలస పాలన ఆనవాళ్లు ముగిసిపోయి.. స్వతంత్ర పాలన మొదలైంది.

**కీలక సంఘాలు**

25. రూల్స్ ఆఫ్ ప్రొసీజర్, స్టీరింగ్, ఫైనాన్స్, స్టాఫ్, జాతీయ పతాకం సహా కొన్ని కీలక సంఘాలకు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షుడుగా ఉన్నారు.
26. క్రిడెన్షియల్ కమిటీకి అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ నాయకత్వం వహించగా, భోగరాజు పట్టాభి సీతారామయ్య హౌస్ కమిటీకి అధ్యక్షుడుగా ఉన్నారు.
27. ఆర్డర్ ఆఫ్ బిజినెస్ కమిటీకి కె.ఎం. మున్షీ, ఫంక్షన్స్ ఆఫ్ ద కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీ కమిటీకి జి.వి. మావలంకర్ అధ్యక్షులుగా వ్యవహరించారు.

**అంబేద్కర్ దార్శనికత**

28. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షుడుగా ఉన్న డ్రాఫ్టింగ్ కమిటీ రాజ్యాంగ సభలో అతి ముఖ్యమైన కమిటీ.
29. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం డ్రాఫ్ట్ తుది ప్రతిని 1948, నవంబర్ 4న మొదటి పఠనం కోసం రాజ్యాంగ సభకు సమర్పించారు.
30. రాజ్యాంగ ప్రతి మీద ఐదు రోజులు సాధారణ చర్చలు జరిగాయి. ఇవి 1948, నవంబర్ 9న ముగిశాయి.

**రాజ్యాంగ రచన సంఘం (డ్రాఫ్టింగ్ కమిటీ)**

31. డ్రాఫ్టింగ్ కమిటీని 1947, ఆగస్ట్ 29న ఎన్నుకొన్నారు.
32. డ్రాఫ్టింగ్ కమిటీ 141 రోజుల్లో రాజ్యాంగం డ్రాఫ్ట్‌ను రూపొందించింది.
33. చర్చోపచర్చలు జరగడానికి ముందు డ్రాఫ్ట్ రాజ్యాంగంలో 315 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉండేవి.

**ప్రతిపై చర్చలు**

34. డ్రాఫ్ట్ రాజ్యాంగం మీద రాజ్యాంగసభ 165 రోజులు చర్చలు (డెలిబరేషన్స్) జరిపింది.
35. ఈ 165 రోజుల్లో 114 రోజులను ప్రత్యేకంగా కేవలం డ్రాఫ్ట్ రాజ్యాంగం గురించి చర్చించడానికే వెచ్చించారు.
36. డ్రాఫ్ట్ రాజ్యాంగానికి మొత్తం 7,635 సవరణలను ప్రతిపాదించారు.

**తుది ప్రతి**

37. ఈ 7,635 సవరణల్లో 2,473 సవరణలను రాజ్యాంగ సభ పరిశీలనకు ఉంచారు.
38. తుది రాజ్యాంగంలో 395 అధికరణలు, 22 భాగాలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి.
39. స్వీకరించే నాటికి భారత రాజ్యాంగం ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగం.

**చివరి సమావేశం**

40. రాజ్యాంగ సభ చివరి సమావేశం 1950, జనవరి 24న జరిగింది.
41. ఈ రోజున 284 మంది రాజ్యాంగంలో సంతకాలు చేశారు. 'జన గణ మన'ను అధికారికంగా భారతదేశ జాతీయ గీతంగా ప్రకటించారు.
42. ఈ సమావేశంలోనే డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ను భారత దేశ మొదటి రాష్ట్రపతిగా ప్రతిపాదించారు.

**రాజ్యాంగ ప్రయాణం**

43. స్వతంత్ర భారతదేశానికి తగిన రాజ్యాంగాన్ని రూపొందించడానికి రాజ్యాంగ సభ 2 సంవత్సరాల 11 నెలల 17 రోజుల సమయం పట్టింది.
44. రాజ్యాంగ రచన సమయంలో రాజ్యాంగ సభ మొత్తం 11 సమావేశాలను నిర్వహించింది.
45. ఈ సమయంలో కాన్‌స్టిట్యూషన్ హాల్ వీక్షకుల గ్యాలరీ నుంచి 53,000కు పైగా సందర్శకులు రాజ్యాంగ చర్చలను వీక్షించారు.

**ముఖ్యమైన తేదీలు**

46. భారత రాజ్యాంగానికి 1949, నవంబర్ 26న ఆమోదం తెలిపారు.
47. 1950, జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది.
48. అలా భారతదేశం గణతంత్రంగా పరివర్తన చెందిన సందర్భానికి గుర్తుగా 1950 జనవరి 26ను 'భారత గణతంత్ర దినోత్సవం'గా జరుపుకొన్నారు.

**రాజ్యాంగాల ప్రభావం**

49. భారత రాజ్యాంగంలో... సమాఖ్య విధానం, గవర్నర్ బాధ్యతలు, న్యాయ వ్యవస్థ అంశాలపై భారత ప్రభుత్వ చట్టం 1935 ప్రభావితం చేసింది.
50. ప్రాథమిక హక్కులు, న్యాయసమీక్ష, రాష్ట్రపతి మహాభియోగం విషయాల్లో అమెరికా రాజ్యాంగం స్ఫూర్తినిచ్చింది.
51. రాజ్య విధాన ఆదేశిక సూత్రాలు, రాష్ట్రపతి ఎన్నిక విధానంలో ఐర్లాండ్ రాజ్యాంగం దోహదపడింది.

**గాంధేయ ఆదర్శాలు**

52. వ్యక్తిగతంగా, సహకార ప్రయత్నాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడానికి రాజ్యాంగాన్ని గాంధేయ ఆదర్శాలు ప్రభావం చూపాయి.
53. మత్తు పదార్థాల వినియోగంపై నిషేధం విధించడానికి సంబంధించిన నియమాల విషయంలో మహాత్మాగాంధీ దార్శనికత కనిపిస్తుంది.
54. మంచి సమాజ నిర్మాణ లక్ష్యంగా భావి ప్రభుత్వ విధానాల మార్గదర్శకాలుగా గాంధీజీ దార్శనికతను మేళవించుకుని ఈ నియమాలను ఆదేశిక సూత్రాల్లో చేర్చారు.

**సామాజిక సమానత్వం**

55. అధికరణం 17 అంటరానితనం ఏ రూపంలో ఉన్నా చట్టం ద్వారా శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తూ ఈ దురాచారాన్ని నిషేధించింది.
56. అధికరణం 18(1)... భూస్వామ్య వ్యవస్థ ఆనవాళ్లకు ముగింపు పలుకుతూ సైనిక, విద్యాపరమైన విషయాల్లో మినహా ఎలాంటి బిరుదులు ఇవ్వడాన్ని నిషేధిస్తుంది.
57. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమ్మిళితత్వాన్ని పెంపొందించడానికి షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాల పట్ల సురక్షిత వివక్షకు రాజ్యాంగం హామీని ఇచ్చింది.

**చేతిరాతతో అద్భుతం**

58. భారత రాజ్యాంగాన్ని చేతిరాతతో తీర్చిదిద్దారు. కాలిగ్రఫీతో కళాత్మకంగా ఇంగ్లిష్, హిందీ భాషల్లో రూపొందించారు. ఇందులో మొత్తం 90,000 పదాలు ఉన్నాయి.
59. ఇంగ్లిష్ మూలప్రతి కాలిగ్రఫీతో రాసే పనిని ప్రేమ్ బిహారీ నారాయణ్ రైజాదా తీసుకున్నారు.
60. ఆయన 1949, నవంబర్ 28న కాలిగ్రఫీ మొదలుపెట్టారు. చేతితో తయారు చేసిన మిల్‌బోర్న్ లోన్ పేపర్ మీద 1950 ఏప్రిల్‌లో పని పూర్తిచేశారు.

**చారిత్రక చిత్రమాలిక**

61. శాంతినికేతన్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు నందలాల్ బోస్ రాజ్యాంగం కాలిగ్రఫీ షీట్లను చిత్రాలతో అలంకరించాడు.
62. ఆయన ఆర్ట్‌వర్క్‌లో మినీయేచర్ శైలిలో 22 చిత్రమాలికలు (ఇలస్ట్రేషన్స్) ఉన్నాయి.
63. ఈ ఇలస్ట్రేషన్స్ సింధూ నాగరికత మొదలుకుని స్వాతంత్ర్యోద్యమం వరకు భారతదేశ చరిత్రలోని ముఖ్యమైన ఘట్టాలు కళ్లకు కడతాయి.

**చరిత్ర భద్రంగా**

64. భారత రాజ్యాంగ మూలప్రతిని హీలియం నింపిన వాయు పేటికల్లో భద్రపరిచారు.
65. వీటిని భారత (పాత) పార్లమెంటులోని లైబ్రరీలో భద్రపరిచారు.
66. ఈ రక్షణ చర్యలు రాజ్యాంగ మూలప్రతిని భవిష్యత్తు తరాలకు చెరిగిపోకుండా అందజేస్తాయి.

**భద్రత వారసత్వం**

67. 1950, జనవరి 26న పార్లమెంట్ సచివాలయం రాజ్యాంగ మూలప్రతి రక్షణ బాధ్యతలు చేపట్టింది.
68. 1955లో డెహ్రాడూన్ కేంద్రంగా పనిచేసే సర్వే ఆఫ్ ఇండియా రాజ్యాంగ మూలప్రతికి చెందిన 1,000 ఆఫ్‌సెట్– ప్రింటెడ్ కాపీలను ముద్రించింది.
69. ఈ కాపీలను పూర్తిచేయడానికి 12 ఏండ్లు పట్టింది.

**నవోదయం**

70. 1950, జనవరి 26న భారతదేశం... బ్రిటిష్ సామ్రాజ్యం గొడుగు నీడల స్వయంప్రతిపత్తి ఉండే డొమినియన్ స్థాయి నుంచి గణతంత్ర దేశంగా అవతరించింది.
71. అలా కొత్తగా ఏర్పడిన గణతంత్రం (రిపబ్లిక్) 'భారత ప్రభుత్వ చట్టం 1935' స్థానాన్ని భర్తీ చేసింది.
72. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం పూర్తి స్వాతంత్ర్యం సాధించిందనడానికి సంకేతం.

**ప్రజాస్వామ్యం మొదలైంది**

73. దేశంలో మొదటి సాధారణ ఎన్నికలు 1951, అక్టోబర్ 25 నుంచి 1952 ఫిబ్రవరి 21 మధ్య జరిగాయి.
74. ఈ ఎన్నికలు కొత్తగా స్వీకరించిన రాజ్యాంగ నియమాల (ప్రొవిజన్స్) ప్రకారం నిర్వహించారు.
75. రాజ్యాంగం ద్వారా స్థాపితమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన తొలి బృహత్తరమైన కార్యాన్ని ఈ ఎన్నికలు ప్రతిబింబిస్తాయి.

**ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో సౌజన్యంతో..**

**అనువాదం: హర్షవర్ధన్ చింతలపల్లి**